క్లుప్తంగా

వైభవంగా రుద్ర హోమం



స్వయం భూ లింగానికి అన్నంతో అభిషేకం చేస్తున్న పురోహితులు

మాకవరపాలెం: స్థానిక వామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రంతోపాటు శివ ముక్కోటిని పురస్కరించుకుని బుధవారం ఉదయం నుంచి ఆలయంలో రుద్ర హోమం, లక్ష్మీగణపతి హోమం, మృత్యుంజయ హోమం తోపాటు ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఆలయంలో ఉన్న స్వయం భూ లింగానికి అన్నంతో అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

పూరిల్లు దగ్ధం



అగ్నికి ఆహుతైన పూరిల్లు

చీడికాడ: మండలంలోని కోనాం శివారు పనసగెడ్డలో విద్యుత్ షార్టు సర్క్యూట్‌తో వంతాల రాజుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. గృహోపకరణాలు, తిండిగింజలు, విలువైన డాక్యుమెంట్లు, కొంత నగదు, దుస్తులు ఆహుతయ్యాయి. దీంతో రాజు కుటుంబం కట్టుబట్టలతో వీధినపడింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.2లక్షల ఆస్తినష్టం జరిగినట్టు అంచనా. ప్రమాద స్థలాన్ని హెచ్‌టీడీ రమేష్, కోనాం సర్పంచ్ సలుగు ఈశ్వరమ్మ అప్పలనాయుడు తదితరులు పరిశీలించి, బాధితునికి పరిహారం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

రాయితీపై వేరుశనగ విత్తనాల పంపిణీ



రైతులకు వేరుశనగ విత్తనాలను అందిస్తున్న ఎంపీటీసీ రాజేష్

కె.కోటపాడు: రైతులకు మేలు చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ తెలిపారు. మండలంలో చౌడువాడ ఆర్బీకేలో రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 30 మంది రైతులకు 30 కిలోల వేరుశనగ బస్తాలను 50 శాతం రాయితీపై రూ.1820కి అందించినట్టు ఆర్బీకే వ్యవసాయశాఖ సహాయకురాలు రామాంజలి తెలిపారు.

నేత్ర శస్త్ర చికిత్సలకు 16 మంది ఎంపిక



శస్త్ర చికిత్సకు వెళుతున్న రోగులు

మాడుగుల రూరల్: వంటర్లపాలెంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 16 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసి, బుధవారం అనిల్‌నీరుకొండ ఆస్పత్రికి బస్సులో తరలించినట్టు స్థానిక భానోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు రాపేట రామకొండలరావు తెలిపారు. క్యాంపు కోఆర్డినేటర్ ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో వారిని తరలించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో వంటర్లపాలెం మాజీ సర్పంచ్ కుమార రాజు, ఆడారి కన్నారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గణేష్‌కు అంగన్‌వాడీల వినతి



అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను బుధవారం కలిశారు. ఎమ్మెల్యే ఇంటికి చేరుకున్న కార్యకర్తలను పోలీసులు నిలువరించారు. ఇంతలో ఎమ్మెల్యే బయటకు వచ్చి అంగన్‌వాడీ కార్యకర్తలతో మాట్లాడారు. వారు ఇచ్చిన వినతిపత్రం తీసుకొని.. తన దృష్టికి తీసుకువచ్చిన అంశాలను ప్రభుత్వానికి వివరిస్తానని హామీ ఇచ్చారు.

ఉత్సాహంగా ‘ఆడుదాం ఆంధ్రా’

అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. విజయమే లక్ష్యంగా క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పోటీల్లో పాల్గొంటున్నారు. ఉత్తమ ప్రదర్శనతో అందర్నీ ఆకట్టుకుంటున్నారు. ఈ పోటీలను నిర్వాహకులు పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.



దేవరాపల్లిలో ఉత్కంఠ భరితంగా జరుగుతున్న బాలికల వాలీబాల్ పోటీలు

మాకవరపాలెం: మండలంలోని 15 సచివాలయాల పరిధిలో ఈ పోటీలు జరుగుతున్నాయి. 390 టీంలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నారు. మాకవరపాలెం ఉన్నత పాఠశాలలో మహిళలకు నిర్వహించిన కబడ్డీ పోటీలు రసవత్తరంగా సాగాయి. పోటీలను ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి పర్యవేక్షించగా పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు దగ్గరుండి పోటీలు జరిపిస్తున్నారు.

మాడుగుల: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని సచివాలయం 2, 3, పరిధిలో క్రికెట్ పోటీలను ఎంపీపీ వేమవరపు రామధర్మజ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతంలో యువకుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడానికి ఈ పోటీలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనువాసరావు, పోగ్రాం మండల కోఆర్డినేటర్ మాళి, పంచాయతీ ఈవో సీహెచ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

• మాడుగుల మండలం సాగరం సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా పోటీలను జెడ్పీ సీఈవో, పోగ్రాం మండల స్పెషల్ ఆఫీసర్ ఎం.పోలినాయుడు పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేమవరపు రామధర్మజ, ఇన్‌చార్జి ఎంపీడీవో మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం హైస్కూలు మైదానంలో బుధవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ముకుందపురంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కర్రి గణేశ్ తదితరులు మాట్లాడారు.

కె.కోటపాడు: మండలంలో 22 గ్రామ సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తున్నారు. బుధవారం వాలీబాల్, ఖో–ఖో, షటిల్ పోటీలు జరిపారు. గొండుపాలెం, కె.కోటపాడు, పిండ్రంగి, కొరువాడ గ్రామాల్లో ఈ పోటీలను పీఈటీలు రోహిణి, లక్ష్మి, దేముళ్లు నిర్వహించారు.

దేవరాపల్లి: మండలంలోని 20 సచివాలయాల పరిధిలో వాలీబాల్, కబడ్డీ, క్రికెట్, షటిల్ తదితర క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ పోటీలను ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జి.సంతోషి నళిని, ఎంఈవో–1 బి. పడాల్‌దాస్, ఎంఈవో–2 వి. ఉషారాణి, పీడీలు పర్యవేక్షిస్తున్నారు.

రావికమతం: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. రావికమతం హైస్కూల్‌లో వాలీబాల్ పోటీలు, కొత్తకోట హైస్కూల్‌లో కబడ్డీ,షటిల్ పోటీలు జరిగాయి.

చీడికాడ: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో బుధవారం బాలికలకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కొన్ని సచివాలయాల పరిధిలో మంగళవారమే వాలీబాల్ పోటీలు పూర్తవడంతో గురువారం నుంచి క్రికెట్ పోటీలు ప్రారంభం కానున్నట్టు ఎంపీడీవో జయప్రకాష్ తెలిపారు.

బుచ్చెయ్యపేట: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాల్లో భాగంగా రెండవ రోజు పలు పోటీలు నిర్వహించారు.

దిబ్బిడి, రాజాం గ్రామాల్లో జరుగుతున్న పోటీలను ట్రైనీ కలెక్టర్ స్మరణ్ రాజ్, ఎంపీడీవో సువర్ణరాజు తదితరులు పరిశీలించారు. బుచ్చెయ్యపేట, వడ్డాది, సీతయ్యపేట, రాజాం, గున్నెంపూడి, కొమ్మళ్లపూడి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఆటల పోటీలను ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డైరెక్టర్ గేదెల సత్యనారాయణ పరిశీలించారు.

నాతవరం: మండల కేంద్రం నాతవరం సచివాలయం ఒకటి పరిధిలో బుధవారం మహిళలకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో హనుమంతరావు మండలంలో జరిగే ఆటలు పోటీలను పర్యవేక్షించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి మండల పార్టీ అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఎంఈవోలు తాడి అమృత్‌కుమార్, కామిరెడ్డి వరహాలబాబు పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గొలుగొండ: మండలంలోని 20 గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు జరిగాయి.

చోడవరం: మండలంలో 28 సచివాలయ పరిధిలో రెండో రోజు బుధవారం ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సుమారు 40 జట్లు పాల్గొన్నాయి. చోడవరం, గౌరీపట్నం, జన్నవరం పీఎస్‌పేట, లక్ష్మీపురం, ఖండిపల్లి, గవరవరం, లక్కవరం, జుత్తాడ, గోవాడ, ముద్దుర్తి, దుడ్డుపాలెంతోపాటు మిగతా చోట్ల ఎంపీపీ స్కూళ్ల పరిధిలో ఉన్న క్రీడా మైదానాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. చోడవరం జరిగిన పోటీలను స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి, తహసీల్దార్ తిరుమలబాబు, ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈఆర్‌వోడీ చైతన్య కూడిన అధికారుల బృందం పరిశీలించింది.



మాకవరపాలెంలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న మహిళలు



మాడుగులలో క్రికెట్ ఆడుతున్న ఎంపీపీ రామధర్మజ



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో, పోగ్రాం స్పెషలాఫీసర్ పోలినాయుడు



కె.జె.పురంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు



ముకుందపురంలో మాట్లాడుతున్న సర్పంచ్ గణేశ్



దిబ్బిడిలో పోటీల నిర్వాహకులు, క్రీడాకారులతో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ స్మరణ్ రాజ్



జి.కొత్తపల్లి యూపీ స్కూల్‌లో నిర్వహిస్తున్న బాలికల వాలీబాల్ పోటీలు



నాతవరంలో కబడ్డీ ఆడుతున్న మహిళలు



నాతవరం మండలం గన్నవరంలో ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న మహిళలు



పోటీలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ రాజేశ్వరి, మండల స్థాయి అధికారులు



కె.కోటపాడు మండలం పిండ్రంగిలో వాలీబాల్ ఆడుతున్న బాలురు



కె.కోటపాడు మండలం గొండుపాలెం హైస్కూల్‌లో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు



దేవరాపల్లిలో హోరాహోరీగా జరిగిన కబడ్డీ పోటీలు



రావికమతంలో వాలీబాల్ ఆడుతున్న యువకులు



గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

శంకరంలో అభివృద్ధి టీడీపీ నేతలకు కనబడలేదా

జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు రమేష్

మాడుగుల: గిరిజన పంచాయతీ శంకరం అన్ని విధాలుగా అభివృద్ధి చెందితే అది మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత గవిరెడ్డి రామానాయుడుకు కనబడకపోవడం విడ్డూరంగా ఉందని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు శొలం రమేష్ అన్నారు. శంకరంలో గిరిజనులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము అధికారంలోకి వస్తే పంచాయతీని అభివృద్ధి చేస్తామని బుధవారం ఇక్కడకు వచ్చిన రామానాయుడు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గతంలో మీరు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శంకరం పంచాయతీని ఎందుకు అభివృద్ధి చేయలేకపోయారని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా శంకరం పంచాయతీలో రూ.కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీలు ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రామచంద్రాపురం నుంచి బొడ్డరేవు వరకు రోడ్డు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. టీడీపీ నాయకులు ఏం చెప్పినా నమ్మే స్థితిలో గిరిజనులు లేరన్నారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించిన ఎడ్ల కొండలరావు, తుర్రే కన్నారావు, జి.అప్పారావు, సీహెచ్. ఈశ్వరరావు, ఎముకల మహాలక్ష్మి నాయుడులు ఎప్పుడూ వైఎస్సార్‌సీపీలో లేరని, వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలో చేరారని చెప్పుకోవడం సిగ్గుచేటని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ గిరిజన నాయకులు తుర్రే ఈశ్వరరావు, కూడా పెద తమ్మన్న దొర, సుర్ల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు రమేష్

ఏకగ్రీవంగా బడ్జెట్ ఆమోదం



బడ్జెట్ వివరాలను వెల్లడిస్తున్న ఎంపీడీవో జయమాధవి

నర్సీపట్నం: మండల పరిషత్ 2024–25 అంచనా బడ్జెట్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం సమావేశం జరిగింది. ఎంపీడీవో జయమాధవి సభలో బడ్జెట్ వివరాలను వెల్లడించారు. 2024–25 అంచనా బడ్జెట్‌కు సంబంధించి ప్రారంభ నిల్వ రూ.1.38 కోట్లు, ఆదాయం రూ.66.50 లక్షలు, వ్యయం రూ.92.34 లక్షలు, అంత్య నిల్వ రూ. కోటి 1.12 కోట్లగా బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ తాతబాబు తదితర్లు పాల్గొన్నారు.

సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: నియోజకవర్గ కేంద్రం నర్సీపట్నంలో ఈ నెల 30న జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. క్యాంప్ కార్యాలయంలో బుధవారం నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో మేలు చేసిందన్నారు. బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు రాజకీయంగా, ఆర్థికంగా జగనన్న ఎంతో ప్రోత్సాహం అందించారన్నారు. ఈ మేలును వివరించేందుకు నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ఇన్‌చార్జీలను నియమించారు. మాకవరపాలెం మండలం శెట్టిపాలెం వద్ద సామాజిక సాధికార బస్సు యాత్రకు ఘనస్వాగతం పలుకుతామన్నారు. అక్కడ నుంచి వెయ్యి బైక్‌లతో యాత్ర నర్సీపట్నం చేరుకుంటుందని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. ఇన్‌చార్జీలు సమర్థంగా పని చేసి యాత్రను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, మాజీ చైర్‌పర్సన్ ఆది లక్ష్మి, ఎంపీపీలు సుర్ల రాజేశ్వరి, రుత్తల సత్యనారాయణ, సాగిన లక్ష్మణ్‌మూర్తి, మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, కాపారపు అప్పలనర్స, పార్టీ టౌన్ అధ్యక్షులు ఏకా శివ, నర్సీపట్నం, నాతవరం, మాకవరపాలెం, గొలుగొండ మండలాల పార్టీ అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, నాగేశ్వరరావు, రుత్తల శ్రీనివాస్, లెక్కల సత్యనారాయణ తదితర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలి

రోలుగుంట: ఎయిడ్స్ నియంత్రణకు అందరూ కృషి చేయాలని చైల్డ్ లింకు వర్కర్స్ స్కీం కౌన్సెలర్ ఎం.గణేష్ తెలిపారు. ఎయిడ్స్ నియంత్రణపై బీబీపట్నంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో గణేష్ మాట్లాడుతూ వ్యాధి లక్షణాలు, అనుమానం ఉన్న వారు వెంటనే విధిగా రక్త పరీక్షలు చేయించుకుని, నియంత్రణ చర్యలు పాటించాలని సూచించారు. సర్పంచ్ గరగా విశ్వేశ్వరవు, సొసైటీ సూపర్‌వైజర్ చంద్రశేఖర్, ఏఎన్‌ఎం యశోధ తదితరులు పాల్గొన్నారు.



ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్న సంస్థ అధికారి

80 మందికి వైద్య పరీక్షలు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కె.జె.పురం సచివాలయంలో బుధవారం 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మాడుగుల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ రాజ్‌కుమార్ ఈ పరీక్షలు జరిపారు. ఏఎన్‌ఎంలు అచ్యుతాంబ, సత్య, ఎంఎల్‌హెచ్‌పీ లత, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చివరి దశకు ఖరీఫ్ వరి కోతలు

మాడుగుల రూరల్: పెద్దేరు జలాశయం ఆయకట్టు పరిధిలో వరి కోతలు చివరి దశకు చేరుకున్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావం వల్ల కోతలను ఆలస్యంగా ప్రారంభించారు. ముందుగా కోసిన వరి పంటను ప్రస్తుతం నూర్పులు చేస్తున్నారు. వరికోతల అనంతరం పంట పొలాల్లో రైతులు అపరాలు జల్లుతున్నారు.

నూకాంబిక ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా మండపం

అనకాపల్లి: నూకాంబిక ఆలయానికి ఉత్సవ మండపం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, ఈవో బండారు ప్రసాద్, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్, పార్టీ యువనేత దాడి జయవీర్‌లు అన్నారు. పట్టణంలోని గవరపాలెం నూకాంబిక ఆలయంలో ఉత్సవ మండపాన్ని దాత దాడి సన్యాసిరత్నం(అమ్మలు)తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక కుంకుమార్చనలకు మండపం ప్రధాన కేంద్రంగా నిలుస్తుందన్నారు. అంతకు ముందు ఆలయంలో ఏర్పాటు చేసిన శిలకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు జాజుల ప్రసన్నలక్ష్మి, కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, గ్రీవెన్స్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, వార్డు ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు బుద్ధ నర్సింగరాజు, పీలా లక్ష్మీశ్రీనివాసరావు, ఆడారి ఉమాశ్రీనివాసరావు, కొండూరు రవీంద్రనాథ్, గొల్లవిల్లి నర్సింగరావు, కంటపల్లి శోభారాణి, అర్చకులు యనమండ్ర శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేడ శివ, శిలపరశెట్టి బాబీ, గవరపాలెం గౌరీపరమేశ్వరుల కమిటీ చైర్మన్ కొణతాల సంతోష్ అప్పారావునాయుడు, పలు ఆలయాల చైర్మన్లు ఆళ్ల నాగేశ్వరరావు, కె.ఎం.నాయుడు, పార్టీ నేతలు రేబాక మధు, మేడిశెట్టి గణేష్ పాల్గొన్నారు.



మండపాన్ని ప్రారంభిస్తున్న మురళీకృష్ణ, ప్రసాద్, దాడి రత్నాకర్, జయవీర్, సన్యాసిరత్నం

టీడీపీ యాత్రకు స్పందన కరువు

పార్టీలో మరోసారి బయటపడిన విభేదాలు

మాడుగుల: మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు బుధవారం మండలంలో నిర్వహించిన ‘బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ’ యాత్రకు సొంత పార్టీ నుంచే స్పందన కరవైంది. దీంతో తూతూ మంత్రంగా కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.జి కు మార్, ఆపార్టీ నియోజకవర్గ నాయకులు పైలా ప్రసాదరావు, మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజుతో పాటు పలువురు సీనియర్ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనలేదు. దీంతో మరోసారి పార్టీలో విభేదాలు బయటపడ్డాయి. ఇన్‌చార్జికి సంబంధ ం లేకుండా ఈకార్యక్రమాన్ని నిర్వహించడంతో చాలా మంది కార్యకర్తలు కూడా హాజరుకాలేదు. అరకొరగా హాజరైన పార్టీ కార్యకర్తలతో రామానాయుడు ఒక్కరే శంక రం గ్రామం నుంచి ప్రారంభించి మునిపల్లి, కృష్ణంపాలెం, కాశీపురం, ఎం.కోడూరు, డి.సురవరం, సాగరం, మీదుగా సత్యవరం వరకూ యాత్ర నిర్వహించారు. ఈ యాత్రకు జనాల నుంచి కూడా స్పందన కరవైంది.

విస్తారంగా టమాటా సాగు

కె.కోటపాడు: మండలంలో టమాటా పంటను అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. రెండు నెలల కాలవ్యవధిలోనే కోతదశకు చేరుకొనే పంట టమాటా కావడంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. కె.కె.అగ్రహారం, ఆర్లి, చంద్రయ్యపేట, కె.సంతపాలెం, ఆర్లి, సూదివలస, దాలివలస, మర్రివలస, పాతవలస గ్రామాల్లో సుమారు 300 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మార్కెట్‌లో టమాటాకు ప్రస్తుతం గిట్టుబాటు ధర ఉండడంతో సాగు లాభదాయకంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.